

RNI No: APTEL/2018/76747

# నవతరం

DYNAMIC EDITION తెలుగు దినపత్రిక

| హైదరాబాద్ | సోమవారం | సంపుటి: 9 | సంచిక: 244 | పేజీలు: 04 | వెల: 5 /- | 21 సెప్టెంబర్ 2026 |




## ఎల్ నినో కంటే రేవంత్ రెడ్డి ప్రమాదకరం

**హైదరాబాద్, నవతరం:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రకృతి విపత్తు అయిన ఎల్ నినో కంటే రేవంత్ రెడ్డే రాష్ట్రానికి అత్యంత ప్రమాదకరమని ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే కరెంట్ కోతలు విధిస్తూ, నీళ్లు ఇవ్వకుండా రైతులను ఇబ్బంది పెడుతోందని, రాష్ట్రంలో లేని కరవును సృష్టిస్తోందని ఆరోపించారు.

యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరులో పలువురు కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హరీశ్ రావు మాట్లాడారు. రాష్ట్రంలో జరుగుతున్న సర్వేలన్నీ కేసీఆర్‌కు అనుకూలంగా ఉన్నాయని, అందుకే కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి చేరికలు పెరిగాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని చెప్పుకుంటూనే రాక్షస పాలన సాగిస్తోందని విమర్శించారు.

"అవకాశం ఉన్నప్పటికీ విద్యుదుత్పత్తి చేయకుండా బొగ్గు కొరత అనే సాకుతో కరెంట్ కోతలు విధిస్తున్నారు. కేసీఆర్ గారి హయాంలో 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తే.. ఇప్పుడు కేవలం 6-7 గంటల నాణ్యత లేని విద్యుత్ మాత్రమే వస్తోంది. దీంతో పంటలు ఎండిపోతున్నాయి. కృష్ణా నదిలో నీళ్లున్నా కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ వంటి లిఫ్టులను ఆన్ చేయడం లేదు," అని హరీశ్ రావు మండిపడ్డారు.

మూడు పంటల నుంచి రైతుబంధు నిధులు విడుదల చేయలేదని, కరోనా కష్టకాలంలో కూడా కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు ఆపలేదని గుర్తుచేశారు. యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిపై ప్రమాణం చేసి కూడా సీఎం రేవంత్ రెడ్డి దేవుణ్ని మోసం చేశారని ఆరోపించారు. బాండ్ పేపర్లపై ఇచ్చిన 420 హామీలు, గొర్రెల పంపిణీ, ఫీజ రియింబర్స్‌మెంట్ వంటి పథకాల ఊసే లేదని విమర్శించారు. తనను ప్రశ్నించినందుకు పిట్ట బెదిరింపులకు పాల్పడితే భయపడేది లేదని, ఆయన సంగతి చూస్తామని హెచ్చరించారు.

"కేసీఆర్‌పై బురద చల్లితే రైతులకు న్యాయం జరగదు. పాలించడం చేతకాకపోతే నుదుటిపై 'నామమ్' రాసుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలి" అని హరీశ్ రావు హితవు పలికారు.




## సచివాలయ సిబ్బందికి శుభవార్త

**అమరావతి, నవతరం:** ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఆరేళ్ల సర్వీసును పూర్తి చేసుకున్న ఉద్యోగులకు ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ (AAS) కింద స్పెషల్ గ్రేడ్ పోస్ట్ స్కేల్ (SGP) మంజూరు చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆర్థిక శాఖ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా 15,000కు పైగా ఉన్న స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న సుమారు 1.30 లక్షల మంది ఉద్యోగులు లబ్ధి పొందనున్నారు. ముఖ్యంగా 2019, 2020 సంవత్సరాల్లో తొలి విడతలో నియమితులైన ఉద్యోగులకు ఈ స్కేల్ ప్రయోజనం చేకూరనుంది. 11వ వేతన సవరణ కమిషన్ (PRC) చేసిన సిఫార్సులను అనుసరించి ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని అమలు చేస్తోంది. అయితే, ఇది రెగ్యులర్ పదోన్నతి కాదని, కేవలం ఆర్థిక ప్రయోజనం మాత్రమేనని అధికారులు స్పష్టం చేశారు. ఒకే పోస్టులో ఎక్కువ కాలం పనిచేస్తున్న ఉద్యోగులకు ఆర్థికంగా భరోసా కల్పించేందుకు ఉద్దేశించిన ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్‌లో భాగంగానే ఈ స్పెషల్ గ్రేడ్ స్కేల్‌ను అందిస్తున్నట్లు తెలిపారు

. ఏఏఎస్ నిబంధనల ప్రకారం, ఉద్యోగులకు 6 ఏళ్ల సర్వీసుకు స్పెషల్ గ్రేడ్, ఆ తర్వాత 12, 18, 24 ఏళ్ల సర్వీసుకు తదుపరి ఆర్థిక ప్రయోజనాలు లభిస్తాయి. తాజా ఉత్తర్వుల నేపథ్యంలో, అర్హులైన ఉద్యోగుల సర్వీస్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, వారికి స్పెషల్ గ్రేడ్ పోస్ట్ స్కేల్‌ను వెంటనే మంజూరు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ప్రభుత్వ నిర్ణయంపై సచివాలయ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.




## కారులో సజీవదహనమైన వైద్యుడు

**ఖమ్మం, నవతరం:** ఖమ్మంలోని మమత ఆసుపత్రిలో న్యూరో సర్జన్‌గా పనిచేస్తున్న డాక్టర్ కాసకుర్తి జగదీశ్, తన కారులో ఖమ్మం వైపు వెళ్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. పిల్లలమర్రి వద్దకు రాగానే ఆయన ప్రయాణిస్తున్న కారు అకస్మాత్తుగా అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు కారు మొత్తం వ్యాపించడంతో డోర్లు లాక్ అయ్యాయి. దీంతో డాక్టర్ జగదీశ్ బయటకు వచ్చే అవకాశం లేకపోయింది. అగ్నిగోళంలా మారిన కారులో ఆయన మంటల్లో చిక్కుకుని అక్కడికక్కడే సజీవదహనమయ్యారు. రహదారిపై వెళ్తున్న ఇతర వాహనదారులు ఈ దృశ్యాన్ని చూసి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## అంగుళం కూడా తీసుకోం

**హైదరాబాద్, నవతరం:** రాష్ట్రంలోని దళితుల భూముల్లో అంగుళం కూడా ప్రభుత్వం తీసుకోదని, వారి భూములకు పూర్తి భద్రత కల్పిస్తామని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం స్పష్టం చేశారు. దళితులు, గిరిజనుల భూములను లాక్కోవడం ప్రజల ప్రభుత్వ విధానం కాదని ఆయన తేల్చిచెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం దళితుల భూములకు పూర్తి రక్షణ కవచంగా నిలుస్తుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు. దళితులు, గిరిజనులు, బడుగు బలహీన వర్గాల ఆశీస్సులతోనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని పొంగులేటి పేర్కొన్నారు. సామాజిక న్యాయం, పేదల సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వాల ప్రధాన ప్రాధాన్యతలని అన్నారు. భూసంస్కరణలు, భూ పంపిణీ వంటి చారిత్రక నిర్ణయాలతో నిరుపేద దళితులకు భూములు ఇచ్చి హక్కులు కల్పించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని తెలిపారు. తెలంగాణ ప్రాంతంలో సుమారు 25 లక్షల ఎకరాల భూమిని దళితులకు, 2 లక్షల ఎకరాల పోడు భూములను గిరిజనులకు పంపిణీ చేసిన ఘనత కాంగ్రెస్‌దేనని పేర్కొన్నారు. అధికారంలోకి వస్తే దళితులకు మూడెకరాల భూమి ఇస్తానని చెప్పి మోసం చేసిన 'దొర' కేసీఆర్ మాటలను నమ్మవద్దని ఆయన ప్రజలను కోరారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు చెందిన ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌పై విచారణ జరుపుతామని సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటించిన నేపథ్యంలో ఈ వివాదం మొదలైంది. ఈ ఫామ్‌హౌస్ దాదాపు 700 ఎకరాల్లో విస్తరించి ఉందని, అందులో 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని ముఖ్యమంత్రి ఆరోపించారు. ఈ క్రమంలోనే ఎర్రవల్లి గ్రామానికి చెందిన 120 మంది దళిత రైతులకు రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు.

భూ యాజమాన్య హక్కులకు సంబంధించిన పత్రాలతో హాజరుకావాలని ఆ నోటీసుల్లో పేర్కొనడంతో దళితుల్లో ఆందోళన మొదలైంది. ఈ నేపథ్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. "ప్రభుత్వం మీ భూమిలో అంగుళం కూడా తీసుకోదు. మీ భూములను స్వాధీనం చేసుకునే ఉద్దేశం ఈ ప్రభుత్వానికి లేదు. మీ భూముల విషయంలో ఎలాంటి భయం, ఆందోళన అవసరం లేదు. ప్రజల ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది" అని దళితులకు భరోసా ఇచ్చారు. భూ రికార్డుల పరిశీలన, సర్వే, భూ సమస్యల పరిష్కారం వంటి ప్రక్రియలను భూములు లాక్కోవడంగా చూడటం సరికాదని ఆయన హితవు పలికారు. ప్రజల భూ హక్కులను స్పష్టంగా నమోదు చేయడం, వివాదాలను పరిష్కరించడం, వారి హక్కులకు రక్షణ కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. కొంతమంది శక్తిమంతమైన వ్యక్తులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం దళితులను రెచ్చగొట్టేందుకు ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తూ భయాందోళనలు సృష్టిస్తున్నారని మంత్రి ఆరోపించారు. వాస్తవాలు తెలుసుకోకుండా ఇలాంటి ప్రచారాలను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం తీసుకునే ప్రతి చర్య చట్టబద్ధంగా, పారదర్శకంగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.



## ముందే అంచనా వేసుకున్నాం

**అమరావతి, నవతరం:** రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావం, తీసుకోవాల్సిన చర్యలు, కార్యాచరణ ప్రణాళిక అమలుపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు, ఆర్ఎస్కే సిబ్బందితో ఆయన టెలీకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఎల్ నినో వంటి విపత్కర పరిస్థితుల్లో రైతులను ఆదుకోవడం, మార్కెట్‌లో నిత్యావసరాల ధరలు పెరగకుండా నియంత్రించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని ఆయన స్పష్టం చేశారు. ఈ విపత్తును ఒక సవాలుగా స్వీకరించి, ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, "ఎల్ నినో పరిస్థితులను మనం ముందుగానే అంచనా వేశాం. దీనికోసం సిద్ధం చేసుకున్న యాక్షన్ ప్లాన్ ప్రకారం ప్రతి ఒక్కరూ పనిచేయాలి. ఎల్ నినో ప్రభావం కేవలం రైతులపైనే కాదు, అన్ని వ్యవస్థలపైనా పడుతుంది. కాబట్టి రైతులను కాపాడుకుంటూనే, వినియోగదారులపై ధరల భారం పడకుండా చూడటం మన బాధ్యత" అని అన్నారు. బియ్యం, ఉల్లి, పామాయిల్, కందిపప్పు వంటి నిత్యావసరాల ధరలను కచ్చితంగా అదుపులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. గోదాముల్లోని బియ్యం నిల్వలను మార్కెట్‌లోకి విడుదల చేసి, ధరలు పెరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉల్లి కొరతను అధిగమించేందుకు ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేయడంతో పాటు, భవిష్యత్ డిమాండ్‌కు అనుగుణంగా ఉల్లి సాగును ప్రోత్సహించాలని తెలిపారు. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను వివరిస్తూ, రాష్ట్రవ్యాప్తంగా 50.7 శాతం లోటు వర్షపాతం నమోదైందని, ముఖ్యంగా ప్రకాశం, అన్నమయ్య, శ్రీ సత్యసాయి జిల్లాల్లో పరిస్థితి ఆందోళనకరంగా ఉందని అన్నారు. ఖరీఫ్ సీజన్‌లో 30.84 లక్షల హెక్టార్లకు గాను,

ఇప్పటివరకు 79 శాతం భూముల్లోనే సాగు పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులు నష్టపోకుండా ఉండేందుకు పంటల బీమా మొత్తాలు వారికి అందేలా చూడాలని, డిమాండ్ ఆధారిత పంటల సాగుపై దృష్టి సారించాలని చెప్పారు. వర్షాధార పంటలు, ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరిస్తూ, హైరిస్క్ జోన్‌లోని ఉద్యాన పంటలను కాపాడేందుకు రూ.190 కోట్లు కేటాయించామని, ఆ నిధులను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఖరీఫ్ కంటింజెన్సీ ప్రణాళిక కోసం రూ.60 కోట్లు సిద్ధం చేశామని, 1.31 లక్షల క్వింటాళ్ల విత్తనాలను 80 శాతం సబ్సిడీతో రైతులకు సరఫరా చేశామని తెలిపారు. స్వయం సహాయక బృందాల ద్వారా కిచెన్ గార్డెన్‌లను ప్రోత్సహించి కూరగాయల ధరలను అదుపులో ఉంచవచ్చని అభిప్రాయపడ్డారు. పశువులకు తాగునీరు, పశుగ్రాసం కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. గత ప్రభుత్వ వైఫల్యాలను ప్రస్తావిస్తూ, "2014-19 మధ్య మేము ఇరిగేషన్‌పై రూ.65 వేల కోట్లు ఖర్చు చేస్తే, 2019-24 మధ్య నాటి ప్రభుత్వం కేవలం రూ.22 వేల కోట్లే ఖర్చు చేసింది. ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే ఎల్ నినో వంటి విపత్తు వచ్చినా ఇబ్బందులు ఉండేవి కావు. మేము అధికారంలోకి వచ్చాక రూ.3,500 కోట్లతో 100 రోజుల్లో హంద్రీ-నీవా కాలువలకు నీరందించగలిగాం" అని చంద్రబాబు గుర్తుచేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, స్థానిక ఎన్నికలున్నా ప్రజాప్రతినిధులు గ్రామాల్లో పర్యటించి రైతులకు ధైర్యం చెప్పాలని సూచించారు.

# వాళ్లూ, వీళ్లూ వదిలిన బాణాన్ని కాదు

**హైదరాబాద్, నవతరం:** తాను వాళ్లూ వీళ్లూ వదిలిన బాణాన్ని కాదని, దశాబ్దాలుగా అధికారానికి, విద్యకు దూరంగా ఉన్న బహుజనుల బాణాన్ని అని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. యువత, బహుజనుల హక్కుల కోసం ప్రధాని మోదీ, సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్‌తో అయినా కొట్లాడటానికి సిద్ధమని ఆమె ప్రకటించారు. వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో ఆదివారం నిర్వహించిన 'పాంచజన్య సంకల్ప సభ'లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సభకు ముందు కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీగా వేదిక వద్దకు చేరుకున్న కవిత, తన రాజకీయ వైఖరిని వివరిస్తూ ప్రత్యర్థులపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. "నన్ను కాంగ్రెస్ వదిలిన బాణమని బీఆర్ఎస్ వాళ్లు, కేసీఆర్ వదిలిన బాణమని రేవంత్‌రెడ్డి అంటున్నారు. మరికొందరు తలకాయ లేనివాళ్లు బీజేపీ బాణమని మాట్లాడుతున్నారు.

కొడంగల్ గడ్డపై నుంచి నేను ఒక్కటే చెబుతున్నా. నేను తెలంగాణ బహుజనుల బాణాన్ని. యువజనుల యుద్ధ నినాదాన్ని. అంబేడ్కర్ వాదాన్ని, మహాత్మ జ్యోతిబా ఫులే ఆత్మగౌరవ నినాదాన్ని నేను" అని కవిత ఉద్ఘాటించారు. ఒక మహిళ ఎవరి మద్దతు లేకుండా రాజకీయంగా నిలబడగలదని నిరూపించేందుకే ఇక్కడికి వచ్చానని, ప్రజలు తనకు ధైర్యం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కవిత విమర్శలు చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని గట్టు, కేటీ దొడ్డి మండలాల్లో అక్షరాస్యత రేటు అఫ్గానిస్తాన్‌తో సమానంగా ఉందని, గతంలో విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన రేవంత్ రెడ్డి అప్పుడు ఏం చేశారని నిలదీశారు. దేశంలో మహిళలను మహారాణులుగా కీర్తిస్తారని, కానీ వంటింట్లోని గిన్నెల మీద కూడా మగవాళ్ల పేర్లే ఉంటాయని ఆవేదన వ్యక్తం చేశారు. 29 రాష్ట్రాలున్న దేశంలో కేవలం ఒక్క రాష్ట్రానికి మాత్రమే మహిళ ముఖ్యమంత్రిగా ఉన్నారని గుర్తుచేశారు. బహుజనులు, మహిళలు, యువత రాజకీయంగా ఎదిగేందుకు తన పోరాటం కొనసాగుతుందని కవిత తెలిపారు.



# ఖద్దరు వెనుక కన్నీటి తడి!

**నవతరం, స్పెషల్ కరెస్పాండెంట్:** రాజకీయం మోజు ఎన్నో జీవితాలను అతలాకుతలం చేస్తోంది. పదవులు రాని వాళ్లే కాదు, పదవులు అనుభవిస్తున్న వారూ ఇబ్బందుల్లో ఉన్నారు. హోదా, దర్పం కోసం స్థాయికి మించి ఖర్చులు పెడుతున్నారు. గ్రామ/పట్టణ, మండల, నియోజక వర్గ స్థాయి నాయకులు ఆఖరుకు జిల్లా స్థాయికి ఎదిగిన వాళ్లు సైతం చేస్తున్న ఖర్చులు గుదిబండగా మారుతున్నాయి. సర్పంచ్/కౌన్సిలర్, ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీ, సహకార సంఘాల చైర్మన్లు.. లాంటి పదవులతో పాటు చోటామోటా నామి నేటెడ్ పదవులు దక్కించుకున్నవారు తాము సంపాదించేది ఏమోగానీ అడ్డగోలు ఖర్చులతో రోడ్డున పడుతున్నారు. రాజకీయాల్లో రాణించేది కొందరే. కానీ అందరూ ఆశలు పెట్టుకుంటారు. పదవుల మీద వ్యామోహంతో ఎన్నికల్లో తలపడి రూ. లక్షలు ఖర్చు చేస్తున్నారు. అయితే ఎన్నికల్లో ఓడిన వాళ్లే కాదు గెలిచిన వాళ్లు కూడా సంతోషంగా లేరని వాళ్ల ఆర్థిక స్థితిని చూస్తే స్పష్టమవుతోంది. రాజకీయాల్లో ఎదురుదెబ్బలు తిని నిలదొక్కుకున్నోళ్లు మాత్రమే ఆచితూచి ఖర్చు చేస్తున్నారు. స్టార్చ్ వేసిన తెల్లటి ఖద్దరు చొక్కా.. కాళ్లకు ఖరీదైన బూట్లు.. తిరగడానికి దొడ్డు పయ్యల కారు.. వెంట నలుగురు అనుచరులు.. జేబులో చిల్లిగవ్వ లేకున్నా పొలిటికల్ లీడర్లు ఇవన్నీ మెయింటేన్ చేయాల్సిందే...! ఎక్కడ చిన్న తేడా వచ్చినా సొంత పార్టీతో పాటు ప్రత్యర్థి పార్టీల నాయకుల ముందు చులకన అవుతామన్న భయం. అందుకే అప్పులు చేసైనా, ఆస్తులు అమ్మైనా సరే దర్పం ప్రదర్శి స్తుంటారు. అడ్డగోలు ఖర్చులతో అప్పులు కుప్పలై, ఆస్తులు హారతి కర్పూరంలా కరిగిపోయి ఎంతో మంది నాయకులు రాజకీయాల నుంచి కనుమరుగవుతున్నారు. మరికొందరు అప్పులు తీర్చే మార్గం లేక, భవి ష్యత్తు కానరాక ఆత్మహత్యలకూ పాల్పడుతున్నారు. ఇటీవలి కాలం లో జిల్లాలో చోటు చేసుకున్న సంఘటనల నేపథ్యంలో ఖద్దరు చొక్కా వెనుక కన్నీటి తడి ఎంత ఉందో ఇటీవలి సంఘటనలు స్పష్టం చేస్తున్నాయి. రాజకీయంలో ఓ స్థాయికి ఎదిగి, డబ్బులు సంపా దించిన వారు కార్లు మెయింటేన్ చేసేవారు. కానీ.. ఇప్పుడు చోటా మోటా లీడర్లందరూ కార్లు కొనుగో లు చేస్తున్నారు. వాయిదాల పద్ధతిలో ఫైనాన్స్, బ్యాంకులు కార్లకు లోన్లు ఇస్తున్నాయి. దీంతో సర్పంచ్ నుంచి మొదలుకుని ఎంపీపీ, జడ్పీటీసీ వంటి పదవుల్లో ఉన్నవారు, ఓడిపోయిన వాళ్లూ, పార్టీ పదవుల్లో కొనసాగుతున్న వారు. నామినేటెడ్ పదవులు పొందిన వారు దాదాపు అందరూ కార్లు మెయింటేన్ చేస్తున్నారు. కారుకు ముందూ, వెనకాల పదవి, హోదా పేరుతో రేడియం స్టిక్కర్లు అంటించుకుని, స్టీరింగు ముందు తమ పార్టీ కండువాను పరచుకుని దర్పం ప్రదర్శిస్తుంటారు.

**గొప్పలకు పోయి..**

రాజకీయాల్లో తిరుగుతున్నవారు నలుగురి ముందు గొప్పగా ఉండేందుకు ప్రయత్నిస్తుంటారు. రోజూ కార్లలో తిరగడానికి పెట్రోల్, డీజిల్ కోసం తక్కువలో తక్కువ రూ. వెయి వెచ్చించాల్సిందే. నలుగురిని వెంట వేసుకుని వెళ్లడంతో వారికి భోజనం, రాత్రికి ఇంత మందుసర్దాల్సిందే. కనీసం రోజ ఖర్చు ఎంత లేకున్నా రూ.2 వేల నుంచి రూ.3 వేలు ఖర్చు చేస్తారు. సరాసరిగా నెలలో వాళ్లు రూ. 40 వేల నుంచి రూ.50 వేల దాకా ఖర్చు చేస్తున్నా రు. కొందరు అవసరముంటేనే కారు బయటకు తీస్తుండగా మెజారిటీ లీడర్లు రోజూ కారులోనే షికా రు చేస్తుంటారు. కొందరు లీడర్లు పైరవీల మీద, మరికొందరు కాంట్రాక్టుల ద్వారా డబ్బులు సంపా దిస్తుంటారు. అవి కూడా అందరికీ కలిసిరావు.

**ఏదో సాధించాలనే భ్రమలో..**

రాజకీయంలో ఏదో సాధిస్తామన్న భ్రమల్లో అడ్డగోలు ఖర్చులతో ఆస్తులు కరిగిపోయి అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతు న్నారు. ఓ మార్కెట్ కమిటీ చైర్మన్ అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రాజకీయ వర్గాల్లో కలకలం రేపింది. అధికార పార్టీ నాయకులంటే వాళ్లకేం తక్కువ అని అం దరూ అనుకుంటారు. కానీ చాలా మంది అప్పుల్లో కూరుకుపోయి ఉన్నట్టు తెలుస్తోంది. తమ ఖర్చులకు తగ్గట్టుగా సంపాదన లేకపో వడం మూలంగా వాళ్లు అప్పులు చేయడం, అప్పులు తీర్చేందుకు ఆస్తులు అమ్ముకోవడం పరిపాటిగా మారింది. ఆస్తులు పోయినా ఇం కా అప్పులు చేసి కొందరు రోడ్డున పడుతున్నారు. రాజకీయాల్లో రాణించినా అందరూ ఆర్థికంగా ఎదుగుతారని అనుకోవడం భ్రమే అవుతోందని ఓ స్థానిక ప్రజాప్రతినిధి పేర్కొన్నారు.



# గణేష్ పూజల్లో పాల్గొన్న నర్సారెడ్డి భూపతిరెడ్డి

**కుత్బుల్లాపూర్, నవతరం:** నియోజకవర్గంలోని పలు వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు నర్సారెడ్డి వీరారెడ్డి, బండారి లేఔట్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వాసు వరగాని, బౌరంపేట్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అర్కల విజయ్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి భరత్ గౌడ్, బండ్ల విజయ్ కుమార్, బత్తుల చిరంజీవి, స్థానిక ప్రజలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.










మహాదేవపురం 277 డివిజన్లో ద్వారకా నగర్ 2 అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న మీ గంటా శివారెడ్డి & టీం జీఎస్ఆర్ - (నవతరం, కుత్బుల్లాపూర్)

# న్యూజిలాండ్ లో 'పచ్చదనం - పరిశుభ్రత' భేష్

**న్యూ జీలాండ్, నవతరం:** న్యూజిలాండ్ లో నేను ప్రధానంగా గమనించింది ఇక్కడి పచ్చదనం-పరిశుభ్రత.దీని విషయంలో ఇక్కడి ప్రజలు పూర్తి అవగాహన కలిగి ఉన్నారు. ప్రభుత్వం కూడా కఠినమైన నిర్ణయాలు తీసుకుంటుంది. ఈ విషయాలు చాలామందికి తెలిసే ఉండవచ్చు. అయినప్పటికి నేను తెలుసుకున్న కొన్ని విషయాలను మాత్రమే ఇక్కడ తెలియజేస్తున్నాను. పచ్చనదనం,పరిశుభ్రతకు మారుపేరుగా, ప్రకృతి వనాలు, అహ్లాదకరమైన వాతావరణంతో సుందర దేశంగా ప్రసిద్ధి చెందిన న్యూజిలాండ్ లో క్లీన్ అండ్ గ్రీన్ నిర్వహణ అద్భుతం. ఇక్కడి నగరాలు, పట్టణాలలో నిత్యం ఉత్పత్తి అయ్యే చెత్తను తొలగించడంలో స్థానిక కౌన్సిల్స్ మరియు వేస్ట్ మేనేజ్మెంట్ సంస్థలదే ప్రముఖ పాత్ర. అయితే పరిశుభ్రతను పాటించడంలో ఇక్కడి పౌరులు ప్రధాన బాధ్యతగా వ్యవహరిస్తారని చెప్పవచ్చు. నగరాలు, పట్టణాలలోని నివాసాలు, వ్యాపార, వాణిజ్య సంస్థల్లో నిత్యం పోగయ్యే చెత్తను తొలగించడం, రోడ్లను శుభ్రపర్చడంలో ఇక్కడి ప్రభుత్వం, స్థానిక పాలక మండళ్ళు అత్యంత శ్రద్ధ వహిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం, స్థానిక మున్సిపాలిటీలు,పాలక మండళ్ళు ప్రత్యేక శ్రద్ధతో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించడం ఓ ప్రత్యేకత. వేస్ట్ మెటీరియల్, వివిధ రకాల చెత్తలను వేయడానికి ప్రతి ఇంటికి, వ్యాపార, వాణిజ్య సంస్థలకు మూడు నుంచి ఐదు రకాల (రంగుల) డబ్బాలను ఇస్తారు. వాటిలో ఒకదాంట్లో వేస్ట్ ఫుడ్, ఇంకోదాంట్లో గార్డెనింగ్ వేస్టేజి, మరొక దాంట్లో రీసైకిలింగ్ అయ్యే అట్ట డబ్బాలు వేయాల్సి ఉంటుంది. ఇళ్ళ ముందు ఉండే ఈ చెత్త డబ్బాలలోని చెత్తను వారానికో సారి వేర్వేరు వాహనాలు వచ్చి తీసుకెళతాయి. ఈ ప్రక్రియ చాలా అద్భుతంగా నడుస్తుంది. చెత్త సేకరణలో ప్రధాన పాత్ర నిర్వహిస్తున్న వేస్ట్ మేనేజ్మెంట్ సంస్థ ఈ దేశంలో అతిపెద్ద భారీ వాహన సముదాయం, చెత్తశుద్ధి కేంద్రాలు కలిగి ఉన్న సంస్థ. దాదాపు 950 కి పైగా భారీ ట్రక్కులు, 200 కి పైగా తేలిక పాటి వాహనాలతో వ్యర్థాల సేకరణ, వ్యర్థాల శుద్ధి ప్రక్రియ, వేస్టేజి పారవేత వంటి పనులు నిర్వహిస్తున్న ఈ సంస్థ లో దేశవ్యాప్తంగా సుమారు 8500 మంది ఉద్యోగులు, కార్మికులు ప్రత్యక్షంగా, మరో 2000 మంది పరోక్షంగా పని చేస్తున్నారు. దేశవ్యాప్తంగా 90 కి పైగా ప్రదేశాలలో ఈ వ్యర్థాల శుద్ధి మరియు చెత్త పారవేత కేంద్రాలను కలిగి ఉంది. ఈ సంస్థ వ్యర్థాల శుద్ధి కేంద్రాలు భారీ పరిశ్రమల్లా పని చేస్తున్నాయి.

**ప్రజలకు పూర్తి అవగాహన తప్పనిసరి**

న్యూజిలాండ్ లో ఉంటున్న స్థానిక ప్రజలకు ప్రతి సిస్టమ్ మీద పూర్తి అవగాహన ఉండాల్సిందే. ముఖ్యంగా క్లీన్ అండ్ గ్రీన్ పట్ల ప్రతి ఒక్కరికి సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలి. లేదంటే ఇక్కడి రూల్స్ ఒప్పుకోవు. చెత్తను రోడ్డు పైనే వేస్తానంటే... లేదా ఒక డబ్బాలో వేయాల్సి చెత్తను ఇంకొక డబ్బాలో వేస్తే ఇక్కడి ప్రభుత్వం ఊరుకోదు. కఠిన చర్యలు, భారీ జరిమానాలుంటాయి. పచ్చదనం-పరిశుభ్రత విషయంలో చాలా కఠినంగా వ్యవహరిస్తారు. మన దేశంలో హైదరాబాద్ వంటి మెట్రో పాలిటన్ నగరాల్లో తడి చెత్త-ఫొడి చెత్త విధానం అమలు చేయడంలోనే విఫలమయ్యాం. ఇందుకోసం జీహెచ్ఎంసీ ఇంటింటికి రెండు చెత్త డబ్బాలు ఇచ్చినప్పటికీ ఫలితం లేకపోయింది. అదే న్యూజిలాండ్ లో అయితే పక్కాగా అమలు చేస్తున్నారు.

వ్యాసకర్త: మామిడి సోమయ్య
సీనియర్ జర్నలిస్ట్

# కుత్బుల్లాపూర్ రెవెన్యూ కార్యాలయంలో చక్రం తిప్పుతున్న రెవెన్యూ ఇన్స్పెక్టర్ కలీం..?

- ప్రభుత్వ భూములపై కబ్జా ఆరోపణలు.. ప్రశ్నించిన రిపోర్టర్‌పై ఆర్ఐ దురుసు ప్రవర్తన?
- కైసర్ నగర్, దేవేందర్ నగర్, సాబీర్ నగర్, మంజూరు నగర్ పరిధిలో భూముల వ్యవహారంపై అనేక అనుమానాలు
- సర్వే నంబర్లు 342, 329, 329/1పై సమగ్ర విచారణకు స్థానికుల డిమాండ్




**కుత్బుల్లాపూర్, నవతరం:** ప్రభుత్వ భూముల పరిరక్షణకు బాధ్యత వహించాల్సిన రెవెన్యూ వ్యవస్థలో కొందరు అధికారుల తీరుపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని కైసర్ నగర్, దేవేందర్ నగర్, సాబీర్ నగర్, మంజూరు నగర్ ప్రాంతాల్లోని సర్వే నంబర్లు 342, 329, 329/1లో ప్రభుత్వ భూముల విషయంలో అక్రమ ఆక్రమణలు, నిర్మాణాలు, క్రయవిక్రయాలకు సంబంధించి అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా, ప్రభుత్వ భూములకు సంబంధించిన అంశాలపై వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించిన ఓ రిపోర్టర్‌తో కుత్బుల్లాపూర్ రెవెన్యూ కార్యాలయానికి చెందిన ఆర్ఐ కలీం దురుసుగా ప్రవర్తించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ భూములపై ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సిన అధికారి.. ప్రశ్నించిన మీడియా ప్రతినిధిపైనే ఆగ్రహం వ్యక్తం చేయడం చర్చనీయాంశంగా మారిందని స్థానికులు అంటున్నారు.

**ప్రభుత్వ భూములపై అసలు ఏం జరుగుతోంది?**

కైసర్ నగర్, దేవేందర్ నగర్, సాబీర్ నగర్, మంజూరు నగర్ ప్రాంతాల్లోని ప్రభుత్వ భూములకు సంబంధించి గత కొంతకాలంగా పలు ఫిర్యాదులు, ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా సర్వే నంబర్లు 342, 329, 329/1లో ప్రభుత్వ భూమి స్వరూపం, విస్తీర్ణం, ప్రస్తుత ఆక్రమణల పరిస్థితి, నిర్మాణాలకు సంబంధించిన అనుమతులు తదితర అంశాలపై స్పష్టత అవసరమని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ రికార్డుల్లో భూమి ఏ కేటగిరీలో ఉంది? ఎంత విస్తీర్ణం ప్రభుత్వ ఆధీనంలో ఉంది? ప్రస్తుతం ఆ భూమిపై ఎవరి ఆధిపత్యం ఉంది? అక్కడ నిర్మాణాలు జరిగితే వాటికి సంబంధించిన అనుమతులు ఉన్నాయా? ఒకవేళ ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురై ఉంటే రెవెన్యూ అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టారు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**అక్రమ నిర్మాణాలకు అండగా నిలుస్తున్నారన్న ఆరోపణలు..**

కొంతమంది స్థానికులు చేస్తున్న ఆరోపణల ప్రకారం, ప్రభుత్వ భూముల్లో జరుగుతున్నట్లు చెబుతున్న అక్రమ నిర్మాణాలు, ఆక్రమణల విషయంలో రెవెన్యూ అధికారులు కఠినంగా వ్యవహరించడం లేదనే విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా ఆర్ఐ కలీం వ్యవహారశైలిపై పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. అయితే ఈ ఆరోపణలు వాస్తవమా? లేక కేవలం అపోహలా? అన్నది అధికారిక రికార్డులు, క్షేత్రస్థాయి సర్వే, విచారణ ద్వారా మాత్రమే తేలాల్సి ఉంది. అందువల్ల ఆరోపణలకు సంబంధించి ఉన్నతాధికారులు నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



**పై అధికారుల ఆదేశాలను కూడా పట్టించుకోవడం లేదన్న విమర్శలు**

ఆర్ఐ కలీం తనకున్న అధికార పరిధిని మించి వ్యవహరిస్తున్నారని, పైస్థాయి అధికారుల సూచనలను సైతం పట్టించుకోవడం లేదని కొందరు ఆరోపిస్తున్నారు. డిప్యూటీ తహసీల్దార్, తహసీల్దార్ స్థాయి అధికారుల సూచనలకు భిన్నంగా తన ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణల్లో వాస్తవమెంత అన్నది సంబంధిత ఉన్నతాధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ భూములకు సంబంధించిన వ్యవహారాల్లో ప్రతి చర్య రికార్డుల ఆధారంగా, నిబంధనల ప్రకారం జరగాల్సి ఉండటంతో అధికారులు పారదర్శకత పాటించాలని ప్రజలు కోరుతున్నారు.





**విలేకరులతో దురుసు ప్రవర్తనపై చర్చ**

ప్రభుత్వ భూములపై ప్రజలకు ఉన్న అనుమానాలను వెలుగులోకి తీసుకురావడం, సంబంధిత అధికారులను ప్రశ్నించడం మీడియా బాధ్యతలో భాగమని పలువురు పేర్కొంటున్నారు. అయితే ఈ అంశంపై సమాచారం కోరిన రిపోర్టర్‌తో ఆర్ఐ కలీం దురుసుగా ప్రవర్తించారని వస్తున్న ఆరోపణలు ఇప్పుడు చర్చకు దారితీశాయి. మీడియా ప్రతినిధులతో అధికారులు సంయమనంతో, బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సి ఉండగా.. ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా దూషణలకు దిగారనే ఆరోపణలు నిజమైతే అది అధికారిక వ్యవహారశైలిపై ప్రశ్నలు తలెత్తేలా చేస్తుందని స్థానికులు అంటున్నారు.






**"ప్రభుత్వ భూమి ప్రజల ఆస్తి"**

ప్రభుత్వ భూములు ఏ ఒక్కరి వ్యక్తిగత ఆస్తి కాదని, అవి ప్రజల ఆస్తి అని స్థానికులు గుర్తుచేస్తున్నారు. భవిష్యత్ తరాలకు ఉపయోగపడే ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన బాధ్యత రెవెన్యూ యంత్రాంగంపై ఉందని పేర్కొంటున్నారు. అందువల్ల సర్వే నంబర్లు 342, 329, 329/1పై ఉన్నతస్థాయి విచారణ చేపట్టి పూర్తి వివరాలను ప్రజల ముందుంచాలని, ప్రభుత్వ భూములపై ఆక్రమణలు ఉంటే వాటిని తొలగించి, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సర్వసమాజం కోరుతోంది.

**సమగ్ర సర్వేతో వాస్తవాలు వెలుగులోకి తేవాలి**

కైసర్ నగర్, దేవేందర్ నగర్, సాబీర్ నగర్, మంజూరు నగర్ ప్రాంతాల్లోని సంబంధిత సర్వే నంబర్లపై రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు సమగ్ర సర్వే నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వ భూమి ఎంత ఉంది, ఆక్రమణకు గురైన భూమి ఎంత, అక్కడ నిర్మాణాలు ఎప్పుడు జరిగాయి, వాటికి ఎవరు అనుమతులు ఇచ్చారు, భూమికి సంబంధించిన రికార్డులు ఎవరి పేర్లలో ఉన్నాయి వంటి అంశాలను పూర్తిస్థాయిలో పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు. ఒకవేళ విచారణలో ప్రభుత్వ భూమి ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు లేదా నిబంధనలకు విరుద్ధమైన క్రయవిక్రయాలు జరిగినట్లు తేలితే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అదే సమయంలో ఆ వ్యవహారంలో అధికారుల నిర్లక్ష్యం లేదా నిబంధనల ఉల్లంఘన ఉన్నట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**వ్యాసకర్త; వజీర్ అహ్మద్, కైసర్ నగర్**

# రేగోడు మోడల్ స్కూల్ కేజీబీవీ హాస్టల్ ఆకస్మిక తనిఖీ

**మెదక్, నవతరం:** రేగోడ్ మండలం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం లో విద్యార్థినులు తీవ్ర వసతులకొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీస మౌలిక సదుపాయాలు లేక, ఇరుకు గదుల్లోనే చదువుకుంటూ, అక్కడే నిద్రిస్తూ అవస్థలు పడుతున్నారు.నేడు సివిల్ జడ్జి మరియు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ ఏ సుచరిత విధుల్లో భాగంగా మోడల్ స్కూల్, కేజీబీవీ హాస్టల్లలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో హాస్టల్లో నెలకొన్న దయనీయ పరిస్థితులు బహిర్గతమయ్యాయి.న్యాయమూర్తి మాట్లాడుతూ పాఠశాలలో తరగతి గదులు చాలా ఇరుకుగా ఉన్నాయని,సుమారు 40 మంది విద్యార్థినులకు ఒకే గదిని కేటాయించారని, పగలు ఆ గదినే తరగతి గదిగా వినియోగిస్తూ, రాత్రికి అక్కడే నిద్రించాల్సిన (డార్మిటరీ) పరిస్థితి ఉందన్నారు. ప్రాంగణంలో కనీస పరిశుభ్రత పాటించడం లేదని, మెయింటెనెన్స్ సరిగ్గా లేదన్నారు. చాలా గదుల్లో ఫ్యాన్లు పనిచేయడం లేదని వేడి ఉక్కపోతలతో ఇబ్బందులు పడుతున్నామని బాలికలు మెజిస్ట్రేట్ దృష్టికి తీసుకువచ్చారు. ఉక్కపోతతో బాలికలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులకు నివేదిక అందించి పరిశుభ్రత మరియు వసతులు మెరుగుపరిచే విధంగా తక్షణమే చర్యలు తీసుకుంటానని అన్నారు. మెయింటెనెన్స్ నిధులు సరిగ్గా రావడంలేదని ఎస్ఓ స్వయంప్రభ మెజిస్ట్రేట్ దృష్టికి తీసుకు వెళ్ళగా అత్యవసరమైన వసతుల విషయంలో ఎలాంటి కాంప్రమైజ్ ఉండకూడదని ఆమెకు సూచించారు. హాస్టల్ ప్రాంగణంలో పేరుకుపోయిన చెత్త విషయంలో ఎస్ ఓ పనితీరు పట్ల అసహనం వ్యక్తం చేశారు. ఆమె వెంట సూపర్డెంట్ నాగరాజు, తాసిల్దార్ దత్త రెడ్డి, ఎస్ఐ పోచయ్య తదితరులు ఉన్నారు.









# ‘అమరావతి’ కోసం విశాఖను దెబ్బతీస్తున్నారు

**విశాఖపట్నం, నవతరం:** అమరావతికి పెద్దపీట వేయడం కోసమే టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం విశాఖపట్నం అభివృద్ధిని ఉద్దేశపూర్వకంగా దెబ్బతీస్తోందని వైసీపీ నేత గుడివాడ అమర్నాథ్ ధ్వజమెత్తారు. స్థానిక సమస్యలను గాలికొదిలి, కేవలం ప్రతిపక్షంపై తప్పుడు ప్రచారం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ధ్వజమెత్తారు.



విశాఖలో మీడియాతో మాట్లాడిన అమర్నాథ్, ముఖ్యమంత్రి చంద్రబాబు అన్ని వేదికలనూ వైసీపీని, పార్టీ నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకోవడానికే వాడుకుంటున్నారని విమర్శించారు. తన రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్ అయిన అమరావతిని ప్రమోట్ చేసుకోవడం కోసమే చంద్రబాబు విశాఖను చిన్నచూపు చూస్తున్నారని ఆరోపించారు. "నగరంలో తీవ్రమైన తాగునీటి ఎద్దడి నెలకొన్నా, కనీస దిద్దుబాటు చర్యలు చేపట్టలేదు. ఇది విశాఖ అభివృద్ధిని నిలిపివేయాలనే ఉద్దేశపూర్వక కుట్రలో భాగమే" అని ఆయన అన్నారు. జగన్ 1.30 లక్షల ఇళ్ల పట్టాలు ఇస్తే, కూటమి ప్రభుత్వం ఆ పనులను నిలిపివేసిందని అమర్నాథ్ గుర్తుచేశారు. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇళ్ల పట్టాల పంపిణీ పేరుతో డ్రామా ఆడుతున్నారని ఎద్దేవా చేశారు. విశాఖలో అత్యంత విలువైన భూములను తమకు కావాల్సిన వారికి, ముఖ్యంగా ఎక్కడినుంచో పుట్టుకొచ్చిన రియల్ ఎస్టేట్ కంపెనీలకు చౌకగా కట్టబెట్టారని తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ భూదోపిడీలో మంత్రి నారా లోకేశ్ తోడల్లుడు, స్థానిక ఎంపీ కూడా భాగస్వామిగా ఉన్నారని ఆరోపించారు. జలాశయాలన్నీ ఎండిపోయి, ప్రజలు తాగునీటి కోసం ఎదురుచూస్తుంటే, సీఎం చంద్రబాబు ఆ సమస్య గురించి మాట్లాడకుండా వైసీపీపై విమర్శలు చేయడం ఆయన చిత్తశుద్ధికి నిదర్శనమని వ్యంగ్యం ప్రదర్శించారు. చంద్రబాబు ఈవెంట్ మేనేజ్‌మెంట్‌తో ప్రజలు విసిగిపోయారని, ప్రధాన సమస్యలను పరిష్కరించకుండా జ్యోతిష్యాలు చెబుతూ కాలం గడుపుతున్నారని అమర్నాథ్ విమర్శించారు. పంచ ధారల జోన్‌లో అక్రమ మైనింగ్‌ను వైసీపీనే అడ్డుకుందని, భవిష్యత్తులో కూడా ప్రజల సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు.

# లిఫ్ట్ ప్రమాదం నుంచి వ్యక్తిని కాపాడిన హైడ్రా

**హైదరాబాద్, నవతరం:** నగరంలోని మూసాపేటలో ఆదివారం ఓ భవనంలో ప్రమాదం జరిగింది. లిఫ్టుకు, గోడకు మధ్య ఇరుక్కుని ప్రాణాపాయ స్థితిలో వేలాడుతున్న ఓ వ్యక్తిని హైడ్రా డీఆర్ఎఫ్ బృందం గంటన్నర పాటు శ్రమించి సురక్షితంగా కాపాడింది. ఈ ఘటన మూసాపేట ఆంజనేయ నగర్‌లోని ఓ మూడంతస్తుల భవనంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే, బాధితుడు మురళి (40), తన భార్యతో కలిసి గ్రౌండ్ ఫ్లోర్ నుంచి రెండో అంతస్తుకు లిఫ్ట్‌లో వెళ్లారు. రెండో అంతస్తు రాగానే ఆయన బయటకు అడుగుపెట్టే ప్రయత్నం చేశారు. అదే సమయంలో మూడో అంతస్తులో ఉన్న ఎవరో లిఫ్ట్ బటన్ నొక్కడంతో అది ఒక్కసారిగా పైకి కదిలింది. దీంతో మురళి ఒక కాలు రెండో అంతస్తులో, మరో కాలు లిఫ్ట్‌లో ఉండగానే ప్రమాదం జరిగింది. ఆయన శరీరం లిఫ్టుకు, గోడకు మధ్య ఇరుక్కుపోగా, కాలు గ్రిల్స్‌లో చిక్కుకుని వేలాడసాగారు. లిఫ్ట్‌లోనే ఉన్న ఆయన భార్య కేకలు వేయడంతో అపార్ట్‌మెంట్ వాసులు వచ్చి కాపాడేందుకు విఫలయత్నం చేశారు. అనంతరం ఉదయం 9:15 గంటలకు హైడ్రా కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించారు. వెంటనే కూకట్‌పల్లిలోని డీఆర్ఎఫ్ బృందం మార్షల్ జేడీవీ ప్రసాద్ నేతృత్వంలో 9:30 గంటలకే ఘటనా స్థలానికి చేరుకుంది. పరిస్థితి తీవ్రతను గమనించి సనత్‌నగర్ ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు తెచ్చిన హైడ్రాలిక్ కట్టర్ సాయంతో, లిఫ్ట్ పక్కన ఉన్న గోడను బద్దలుకొట్టి సుమారు గంటన్నర పాటు శ్రమించి మురళిని బయటకు తీశారు. ఉదయం 10:50 గంటలకు ఈ ఆపరేషన్ పూర్తయింది. భవనంలోని పాత గ్రిల్స్ లిఫ్ట్ సెన్సార్లు సరిగా పనిచేయకపోవడమే ఈ దుర్ఘటనకు కారణంగా తెలుస్తోంది. ఈ ప్రమాదంలో మురళి కాలు లిఫ్టుకు, గోడకు మధ్య నలిగిపోవడంతో ఫ్రాక్చర్ అయింది. సిబ్బంది అతడిని వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. సకాలంలో స్పందించి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తిని కాపాడిన హైడ్రా డీఆర్ఎఫ్, ఫైర్ సిబ్బందిని స్థానికులు అభినందించారు.



# ఆందోల్ నియోజకవర్గంలో పర్యటించిన దామోదర రాజనర్సింహ

**ఆందోల్, నవతరం:** తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రిదామోదర్ రాజనర్సింహ ఆందోల్ నియోజకవర్గంలో పర్యటించారు. ఈ పర్యటనలో... ఆందోల్ మండలంలోని డాకూర్ సిఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పర్యటన లో భాగంగా వట్పల్లి మండలం ఉసిరిక పల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ మన్నె నర్సింలు గారి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.వారి వర్ధంతి సందర్భంగా మంత్రి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం, ఉసిరిక గ్రామంలో అనారోగ్యం తో బాధ పడుతున్న మాజీ జెడ్పిటిసి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పట్లోళ్ల రాంరెడ్డి ని మంత్రి దామోదర్ రాజనర్సింహ పరామర్శించారు, వారి ఆరోగ్య పరిస్థితిపై స్వయంగా అడిగి తెలుసుకున్నారు. పర్యటన లో భాగంగా మార్వెల్లి గ్రామం లో కార్యకర్తలతో సమావేశమయ్యారు. శ్రీ సిద్ధివినాయక యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట పిసిసి పాధ్యక్షులు సంగమేశ్వర్, మండల పార్టీ అధ్యక్షులు విశ్వాస్, మాజీ అధ్యక్షులు రమేష్ జోషి, ఆత్మ కమిటీ చైర్మన్ కమర్ రావు, జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్ మోహన్ రెడ్డి, పార్టీ నియోజక వర్గ ముఖ్య నాయకులు శేరి జగన్ మోహన్ రెడ్డి, సురేందర్ గౌడ్, దిగంబర్ రావు, మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, అల్లదుర్గ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శేషా రెడ్డి , పెద్దపట్ల వినయ్ గౌడ్, వివిధ గ్రామాల సర్పంచ్ లు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.





Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747, Dr. Narsimlu Yellampally (B.Tech, MBA, Journalism (NiMA), Ph.D(Hons) in Mass Communication & Journalism - Bureau Chief, Telangana, 9618907705, email: pressmanbharat@gmail.com, Telangana State Office: Plot No. A/9, Phase -I, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India.
https://epaper.navatharam.com